చిల్లర దుకాణంలోంచి బయటపడి బజార్లో అరడజను అరటి పండ్లు బేరమాడకుండా తీసుకుని ఇల్లు చేరుకున్నాడు శివానందం. అన్నం ముందు కూర్చొని వట్టి పచ్చిమిరపకాయల కారంతో ముద్దలు మింగుడుపడక అన్నాడు. "బంకులో కూరగాయలు లేవా?"

గాయత్రి పలకలేదు. పైట చెరగు నిండుగా కప్పుకుని కూర్చొని తదేకంగా చూస్తూ వుంది.

మధ్యాహ్నం కొడుకులిద్దరూ చెరో రెట్ట పట్టుకుని తిర్నాలొచ్చిందని సతాయించారు. పిల్లలకు అదొక మోజు, అదొక ఉత్సాహం, అది తీరితే ఒక ఆనందం.

# జీవసమాధి!

దేవిరెడ్డి వెంకటరెడ్డి



అన్నీ గమనించే వాళ్ళడిగినన్ని డబ్బులు "మీ నాన్నతో యిప్పిస్తా"నంది. ఆ పూట అందరూ గాజులు తొడిగించుకుంటారు. తనూ గాజులు తొడిగించుకోవాలనుకుంది ఎటూ మొండిచేతు లున్నాయి గనుక. యివిగాక ఆ రోజు పండగచేయాలి. తెల్లారితే పారణ చేయాలి.

ఇంత ఖర్చు శివానందంమీద మోపడం మహా నేరమని పించింది. అట్లా అనిపించటానికి కారణమైన జీవితాన్ని వూహించు కుంటుంటే లోపలున్నించి మంట పుట్టుకొస్తున్నది. తిర్నాల కాబట్టి సరిపోయింది— ఐచ్ఛికానికి సంబంధించినది. క్యాన్సర్‌లాంటి పెద్ద జబ్బులే వస్తే.... యే సంతోషాన్ని కలిగించలేనిది. యే బాధనూ తీర్చలేనిది. అందుకే అసహ్యం వేస్తున్నది.

శివానందం చూపు గాయత్రిమీద పడింది. తమ జీవితం

మీద తీవ్రమైన దెబ్బ పడుతుందని ఆ వెంటనే అర్థమయింది.

తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో "నిన్న చూసిన సినిమా బాగుందా గాయత్రీ" అన్నాడు.

"యీ జీవితం కంటే సినిమానే నయం" అంది గాయత్రి. శివానందానికి మెదడు పని చేయలేనంత దిమ్మెక్కింది. నోటికి కారమే తగల్లేదు. చాలారోజుల నుంచి యిలాగే సూటిగా మాట్లాడుతున్నది. తప్పు చేసినట్లు మాటలు కుదించుకోవటం. మలుపు తిప్పటం తన బుద్ధికి నచ్చకపోయినా అలవాటయింది. గాయత్రిని పెండ్లి చేసుకున్నప్పుడు దరిద్రాన్ని అవలీలగా భరించవచ్చునను కున్నాడు. ఒకరినొకరు పేర్లతో పిలుచుకొనేవారు. ఇరుగు పొరుగుకాబట్టి పరిచయం తీగలల్లుకున్నట్లు చేసింది. ఇద్దరి మధ్యవున్న శరీరాకర్షణతో గాయత్రే ముందు పెండ్లిని ఆహ్వానించింది. ఇత్యాదులన్నీ శివానందం నమ్మకానికి ఆధారాలు.


అప్పటికి గాయత్రికి శివానందంతో పెండ్లి తప్ప యింకేమీ అర్థంకాలేదు. ఇద్దరూ నిరక్షరాస్యులు కారు- కాపురముంటున్నది పల్లెటూరూ కాదు. సంసారంలో అడుగుపెట్టినప్పటి నుంచి ఎదురు పడుతున్న అవసరాలు చూస్తుంటే-వాటితో సతమతమవుతుంటే గాయత్రి మీద శివానందం ప్రభావం తగ్గుముఖం పడుతున్నది. జీవితంలో సుఖం ఆశించేందుకు ఆలోచన మొద్దుబారిపోతున్నది. అందుకే అంత తదేకమైన చూపు.

శివానందం నీళ్ళు తాగి మంచమెక్కాడు. గాయత్రి తట్ట కడగటమే మరచిపోయింది. అదే చూపు.... దీర్ఘాలోచనతో కూడుకున్నది. నిరాశగానూ వుంది. కోపంగానూ వుంది.

"నిద్ర రావటం లేదా" అన్నాడు శివానందం.

"హంస తూలికాతల్పం వుందికదా ఎందుకు రాదూ నిద్ర" శివానందం గాయత్రి ముఖం వేపు చూడకుండా వుండలేకపోయాడు. ఎక్కుపెట్టిన బాణంలా వుంది. అప్పుడగుపించింది —తనలాంటి అంగడి గుమస్తాల నిస్తేజ జీవిత ధ్యేయం. కూలి బతుకు నిత్య నివేదన. నెలకు రెండువందల గుమస్తా పని అగత్యమయింది. అంతకుమించి అతనికి అర్హత లేదు. సంసారం మొదలయిన కొద్ది రోజులకే అర్థమయింది—బక్కెద్దులు సోగకు కట్టబడినాయని—కాని తప్పదు. లాగిన కాడికి లాగవలె. లాగిలాగి దొమ్మలు ఎరుపెక్కి చావవలె. సోగ మాత్రం కదలదు.

శివానందానికి అవలోకనం చేసుకోవడం ఇష్టమున్నా తప్పు




## వెన్నెల్లో వేళాకోళమాడే వేళ

వెన్నెల్లో వేళాకోళమాడే వేళ
రా చెలి నా చెలి నీవే నా జాబిలి
చిక్కని చక్కని వెన్నెల చక్కలిగిలి పెట్టుంటే
పచ్చని పచ్చిక వెచ్చగ మచ్చిక చేస్తుంటే
రా ప్రియ నా ప్రియ నీవే నా లయ
నిన్నూ నన్నూ చూసి
నిన్న మొన్న సంబరపడుతుంటె
నీవైపు నావైపు చూసి
రేపు మాపు ముచ్చటపడుతుంటె
నీవంక నావంక చూసి
నెలవంక వెన్నెల చిమ్ముతుంటె
రా చెలి నా చెలి నీవే నా జాబిలి
వెన్నెల్లో వేళాకోళమాడే వేళ.

—రావిపాటి అజయ్‌కుమార్

కొనే గుణమూ అలవడుతున్నది. గాయత్రిని చూస్తున్నప్పుడల్లా భ్రాంతిమయలోకమే కావాలనిపిస్తుంది. సహజంగా గాయత్రి ముఖమే ఒక రస జగత్తు. కాని జీవితం తన్నుకుపోతున్నది.

"గాయత్రీ! పిల్లలు నిద్రపోతున్నారు. మంచి సినిమాకు పోదాం పద. మనస్సులు కుదుటపడతాయి" అన్నాడు.

"తెల్లారితే కుంపట్లవుతాయి" మోకాళ్ళమీద తలొంచుకుని అంది.

"తెల్లవారడం గురించి ఎందుకిప్పుడు?"

"ఏం....పొడిచే పొద్దును ఆపుతావా?"

శివానందానికి నోటమాట పెగలలేదు. గాయత్రి ప్రశ్నలకు విఫలం కావడం మామూలే. చాల రోజుల నుంచి నిర్భయంగా అడగాలనుకుంటున్నాడు. వాయిదాపడుతున్నది. వేగంగా కొట్టుకుంటున్న గుండెతో ప్రయత్నం చేశాడు.

"జీవితం పట్ల నీకెందుకింత వ్యతిరేకత?"

"కంపుకొడుతున్నది గనుక."

"ఎక్కడ? ఏ భాగం?"

గాయత్రి తలెత్తి అన్నది. "నాకు వమొస్తున్నది. నువు తప్ప యే సుఖం వుంది గనుక యిందులో? తినేందుకు ఆరోగ్యకరమయిన తిండి లేదు. బెత్తెడు కొంపలో బల్లిలా పడుండాలి. కొంప గలీజు— కొంప చుట్టూ గలీజు. కట్టుకునేందుకు ఎవరికున్నాయి మంచి బట్టలు? కనీసం కంటి నిండా నిద్ర పోడానికి సౌకర్యాలు లేవు. శరీరాలకు రోగాలొస్తే చేతిలో చిల్లిగవ్వ వుండదు. నేనేం రచయిత్రిని కాను- ఒక సంఘటన తీసుకుని ఆర్ద్రంగా చెప్పటానికి. రోజుకు రోజు యీ కంపు ఎక్కువవుతున్నది."

శివానందం మూతి ముడుచుకపోయింది. నిన్నటికీ, యీ రోజుకూ, రేపటికీ యే తేడా తెలియడం లేదు. గాయత్రిని హత్తుకుని సుదీర్ఘంగా నిద్ర పోవాలనిపిస్తున్నది.

"నాకు పడుకోవాలనుంది" అన్నాడు. ఆ రోజే వుతికిన

షోలాపూర్ రగ్గుతో ముసుగుతన్నాడు. కలత కదులుతూనే వుంది. నిద్ర రావడంలేదు. గాయత్రి బోకులన్నీ సర్ది పక్కచేరి అన్నది.

"విడిగా పడుకోడానికి మంచం గతిలేదు."

"ఊc—యింకా చెప్పు. విషాదమైనా, కోపమైనా నువు శుభ్రంగా చెప్తావు."

"ఏముంది చెప్పటానికి అదనంగా:మన బతుకే మసిపాత."

"నిజమే గాయత్రీ! నేను బ్రేక్ యిన్‌స్పెక్టర్నీ కాకపోతి—సేల్‌టాక్సు ఆఫీసర్నీ కాకపోతి. మసిపాత కాక మరేమవుతుంది?"

జీరవోయిన కంఠంతో శివానందం అన్న మాటలు గాయత్రికి కొత్త కాదు. ఆ మాటలు హృదయానికి తాకుతూనే వున్నాయి.

ఆమెకు భర్త సంపాదనెంతో తెలుసు. దాంతో సంసారం గడపాల్సిందే ఆమెకు తెలియంది.

ఇంట్లోకి సరుకులు కావాలంటుంది. తలలకు నూనెలు కావాలంటుంది. పిల్లలకు చెప్పులు, అప్పుడప్పుడు సినిమాలు, ఒక పూటయినా పెరుగూ, నెలకోసారైనా మాంసమూ, మంచాలు, పరుపులు, దోమతెరలు యివన్నీ కావాలంటుంది. శివానందం సరేననటమూ తేలేకపోవటమూ ఆమెకు పాతబడిపోతున్న విషయం. మళ్ళీ పుడుతున్న కొత్త విషయమూ, భర్త నిస్సహాయతమీద సానుభూతి లేని కారణంగానే ఆమెను అసంతృప్తి జ్వాలలు వెంటాడుతున్నాయి. నోటిమాట పదును తేలుతున్నది.

అయిదారు నిమిషాలు నిశ్శబ్దంగావుండి అన్నది గాయత్రి.

"ఒక మంచి కలన్నా వస్తే బాగుండు—రేపటి తిర్నాలకయినా."

శివానందం ముసుగు తీసి గాయత్రి మీద వేశాడు—తిర్నాల ప్రసక్తి రాగానే. ఇందాకా దాగిన విషయాన్ని బయటపెట్టాడు.

"కాళ్ళో కడుపులో పట్టుకుని యాభయ్ అప్పు తెచ్చాను."

ఆమె నిర్లిప్తంగా విన్నది. యే సంబరమూ కలగలేదు. గొంతు నిరసనతో నిండుతున్నది.

"అయినా ఈ కొంపలో ఎప్పుడూ పండగలు—తిర్నాళ్ళు దసరాలు. ఎక్కడపడితే అక్కడ గుళ్ళు గోపురాలు. అవునూ రేపటి తిర్నాల ఎందుకొచ్చినట్లు?"

"మునెయ్యస్వామి—అని ఆయన పేరుతో వచ్చింది."

"మునెయ్యో—రామయ్యో నేనడిగేది అదికాదు."

"ఆయన జీవితచరిత్ర నాకు తెలీదు."

"తెలియందే మేలు. ఒకటి రెండు మాటల్లో చెప్పరాదూ—నాకు నిద్ర వస్తోంది."

"మునెయ్యస్వామి జీవసమాధి అయ్యాడు అందుకు."

గాయత్రికి పక పక నవ్వు పుట్టుకొచ్చింది. నవ్వుతూనే వుంది. నవ్వు దొంతరలు అలలు అలలుగా సాగుతున్నాయి. గాయత్రిలోని గంభీరతకే అలవాటుపడిన శివానందంమనస్తత్వం ఆ నవ్వుని భరించలేకపోయింది. అరచేయి నోటికానించాడు.

"అంత నవ్వెందుకు?"

గాయత్రి శివానందానికి ముసుగు కప్పి అన్నది.

"గుండెలమీద చేయి వేసుకుని చెప్పండి. మనం మాత్రం జీవసమాధి కాలేదా యీ భూమ్మీద?"

మంత్రశక్తితో మార్చలేని, దైవశక్తితో మార్చలేని అంత కటిక ఆర్తిని మార్చటానికి సిద్ధాంతశక్తి లేక శివానందం నోరు మూసుకుని గాయత్రి స్పర్శలో లీనమైపోయినాడు.

✱

